హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ప్రజాశక్తి - తాళ్లపూడి

అఖండ గోదావరి కుడిగట్టు వెంబడి గల మండలంలోని పలు స్నాన ఘట్టాలు అనువగా లేకుండా ప్రమాద భరితంగా ఉండడంతో వాటిని గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని తాళ్లపూడి ఎస్ఐ కెవి.రమణ తెలిపారు. మూడు రోజులుగా జరుగుతున్న తాళ్లపూడి గ్రామ దేవత జాతర మహోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. దీంతో బుధవారం ఉదయం గోదావరి నదిలో స్నానాలు చేయడానికి భక్తులు వెళ్తారు. ఈ నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేసి ముందు జాగ్రత్త తీసుకున్నామని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

దేశానికి పట్టిన గ్రహణం బిజెపి

బిజెపితో అంటకాగితే వైసిపి, టిడిపి, జనసేనలకు గుణపాఠం తప్పదు

ప్రచార భేరి బహిరంగ సభలో వక్తలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

దేశానికి పట్టిన గ్రహణం బిజెపి అని, దాన్ని గద్దె దించకపోతే పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్య హక్కులు కూడా కనుమరుగవుతాయని పలువురు వక్తలు అన్నారు. బిజెపితో అంటకాగితే వైసిపి, టిడిపి, జనసేనలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సిపిఎం, సిపిఐ ప్రచార భేరి కార్యక్రమంలో భాగంగా మంగళవారం కోటిపల్లి బస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడారు. ప్రధాని మోడీ చెబుతున్న అచ్చేదిన్ ఎవరికి వచ్చిందని ప్రశ్నించారు. మోడీ స్నేహితునికి దేశంలోని పోర్టులు, విమానాశ్రయాలు తదితర ప్రభుత్వ రంగ సంస్థలు కారుచౌకగా కట్టబెట్టారన్నారు. ఫలితంగా రూ.30 వేల కోట్ల నుంచి రూ.16 లక్షల కోట్లకు అధిపతిని చేశారని వివరించారు. మరోవైపు దేశంలో నిత్యావసర సరుకులు ధరలు మండిపోతున్నాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధర హామీ అమలుకు నోచుకోలేదని తెలిపారు. కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను 4 లేబర్‌కోడ్‌లుగా మార్చి హక్కులు హరించారని తెలిపారు. మోడీ నిరంకుశ విధానాలను ప్రశ్నిస్తున్న పార్టీలపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో వేధింపులకు గురిచేయడం ప్రజాస్వామ్య హక్కులకు విఘాతమని వివరించారు. తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్, కేరళ విజయన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ వంటి వారిపై కేంద్ర దర్యాప్తు సంస్థల వేధింపులు, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వం రద్దు వంటివి ఉదాహరణగా చెప్పారు. కరోనా కాలంలో ప్రజలు ఎదుర్కొన ఇబ్బందులను గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచిన దాఖలాలు లేవని తెలిపారు. కేరళలో సిపిఎం ప్రభుత్వం కరోనా కాలంలో అక్కడి ప్రజలకు సేవలు అందించి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రాష్ట్రంలో విశాఖ ఉక్కు గొంతు నులిమే ప్రయత్నం జరుగుతుందన్నారు. విశాఖ ఉక్కు- తెలుగు ప్రజల హక్కు నినాదంతో 800 రోజులుగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పోరాటం చేస్తున్నారన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేపట్టనున్నామని తెలిపారు. రాజ్యాంగానికి తూట్లు పొడిచి మనుస్మృతి అమలు చేసేందుకు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి ప్రభుత్వానికి పాలించే హక్కులేదన్నారు.

సభకు హాజరైన జనం

సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు రావుల వెంకయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలన అస్తవ్యస్థంగా ఉందన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల కోసం ఎందుకు ప్రశ్నించడంలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు చేపట్టిన ప్రచార భేరికి విశేష మద్దతు లభించిందని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి టి. అరుణ్ మాట్లాడుతూ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా ఎర్రజెండా సత్తా చూపిస్తామని తెలిపారు. మేడే విజయవంతం చేసేందుకు కార్మికులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. అనతరం సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మధు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్ఎస్.మూర్తి, శ్రామిక మహిళా నాయకులు కె.బేబిరాణి పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న సిపిఐ జాతీయ నాయకులు వెంకయ్య,సిపిఎం రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్

సభకు హాజరైన మహిళలు

సుస్థిర ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

సమావేశంలో పాల్గొన్న జెసి, కలెక్టర్

సుస్థిర ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత అని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సుస్థిర ఆరోగ్య అభివృద్ధి లక్ష్యాల అంశాలపై జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్‌తో కలిసి కలెక్టర్ విద్య, వైద్య మహిళా సంక్షేమ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 12,204 మంది గర్భిణులను గుర్తించామన్నారు. వీరికి రక్తహీనత లేకుండా పౌష్టికాహారాన్ని అందిస్తూ ప్రత్యేమైన చర్యలు చేపట్టాలని స్త్రీ, శిశు సంక్షేమం, వైద్యాధికారులను ఆదేశించారు. గర్భధారణ సమయంలో, పెరుగుతున్న పిండానికి, అలాగే తల్లికి తగినన్ని పోషకాలను, ఆక్సిజన్ అందించడానికి అనుగుణంగా అధిక స్థాయిలో రక్త ఉత్పత్తి అవసరం అన్నారు. గర్భధారణ సమయంలో తక్కువ స్థాయిలో హిమోగ్లోబిన్ 11 శాతంకు కంటే తక్కువ ఉండకుండా పోషక విలువలు ఉన్నా మంచి పౌష్టికాహారం అందించాలన్నారు. జిల్లాలో తగిన వయస్సు కంటే బరువు తక్కువగా ఉన్నవారు 2,760 మందిని, కుంగిపోయిన పిల్లలు 4,585 మంది గుర్తించమన్నారు. వీరిలో తీవ్ర అనిమియ లోపం కలిగిన వారికి వైయస్ఆర్ ప్రత్యేక పోషకతతో కూడిన పౌష్టికాహారం అందించాలన్నారు. అదేవిధంగా ప్రతి మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ద్వారా వైద్యులు ప్రతి నెలా పరీక్షలు నిర్వహించి వారికి ఎటువంటి పోషకారాన్ని అందించాలో సూచించాలన్నారు. వైద్యులు ప్రతి నెలా పరీక్షలు నిర్వహించడం వల్ల పిల్లల ఆరోగ్య పరిస్థితులు మెరుగుపడటంతో పాటు వారిలో హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందన్నారు. మహిళా సంక్షేమం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమనవ్యంతో గర్భిణిలకు రక్త హీనత లోపం వున్నా చిన్నారులను గుర్తించడంలో సంఖ్యాపరమైన అవగాహన ఉండాలన్నారు. ఈ దిశలో సచివాలయం పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, వాలంటీర్ వారీగా ప్రత్యేక దష్టి పెట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, ఎల్ఎటిబి అధికారి డా ఎన్. వసుంధర, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ అధికారి కె.విజయకుమారి, సిపిఒ ఎస్.ప్రకాశరావు, డిఇఒ ఎస్.అబ్రహాం, డిఎల్‌డిఒ పి.వీణాదేవి తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - తాళ్లపూడి

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్ నిరంకుసత్వాన్ని నిరసిస్తూ ఫ్యాఫ్టో పిలుపు మేరకు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఈ నిరసన విజయవంతమైందని ఎపిటిఎఫ్ జిల్లా శాఖ అధ్యక్షులు దున్నా దుర్గారావు తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పాఠశాలల తనిఖీల పేరుతో ఉపాధ్యాయులను, విద్యాశాఖ ఉన్నతాధికారులను అవమా నిస్తూ సస్పెన్షన్లు విధించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా సెక్రటరీ తన వైఖరి మార్చుకోవాలని లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని దుర్గారావు హెచ్చరించారు. దీనిలో భాగంగా మంగళవారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు నిరసన వ్యక్తం చేశారు.

మండలాభివృద్ధికి సమిష్టి కృషి

ప్రజాశక్తి-కడియం

మండలంలో అనేక రకాలైన సహజ వనరులు, దేశవ్యాప్త ప్రసిద్ధిగాంచిన సుందర నర్సరీలు ఉన్నాయని వాటిని సద్వినియోగపరుచుకుని నిధులు సమకూర్చుకునేందుకు ప్రత్యేక ప్రణాళికల ద్వారా ఉమ్మడి నిర్ణయం తీసుకుంటామన్నారు కడియం మండల ప్రజా ప్రతినిధులు. మంగళవారం కడియం మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అధికారులు వివరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్రస్టాలిన్ మాట్లాడుతూ పార్టీలకు, కులాలకు, మతాలకు అతీతంగా సమిష్టిగా మండల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. దీనిపై ఎంపిపి స్పందించారు. వారం రోజుల్లోనే దీనిపై అందరూ కలిసి మంచి నిర్ణయం తీసుకుందామన్నారు. అనంతరం పంచాయతీ రాజ్ దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్న జేగురుపాడు సర్పంచ్ స్టాలిన్‌ను ఘనంగా సత్కరించి, ప్రత్యేక అభినందనలు తెలిపారు. అనంతరం మండల స్థాయి అవార్డులు అందుకున్న వివిధ గ్రామాల సర్పంచులను, కార్యదర్శులను ఎంపిపి చేతుల మీదుగా పూలదండలు, శాలువా కప్పి మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, శాప్ డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, ఎంపిటిసి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. .

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి వ్యక్తి మృతి

బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని, మృతుని కుటుంబానికి రూ.50లక్షల పరిహారం ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి అరుణ్ డిమాండ్ చేశారు. జెఎన్ రోడ్డు, షిర్డి సాయి మార్గంలో డ్రెయినేజీ నిర్మాణం కోసం తీసిన గోతిలో వ్యక్తి జారిపడి మతి చెందిన ఘటనపై ఆయన మాట్లాడారు. నగరపాలక సంస్థ అభివృద్ధి పనులు పేరుతో చేపట్టిన పనుల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుందన్నారు. దీని కారణంగానే డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి చెందాడన్నారు. ఈ ఘటన నగరపాలక సంస్థ నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. పనులు నిర్మాణ దశలో ఉన్న సమయంలో దానికి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంలోనూ అధికారులు విఫలమయ్యారన్నారు. కనీసం హెచ్చరిక బోర్డులనూ నగర పాలక సంస్థ ఏర్పాటు చేయలేదని అన్నారు. చిన్న చిన్న రోడ్లలోనూ డివైడర్లు నిర్మిస్తున్నారన్నారు. సోమవారం ప్రమాదం జరిగిన ప్రాంతం రోడ్డులోకి అగ్నిమాపక యంత్రం కూడా వెళ్లలేని పరిస్థితులను తీసుకొచ్చారన్నారు. అభివృద్ధి పేరుతో చేస్తున్న పనులు ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయన్నారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత నగరపాలక సంస్థ వహించాలని డిమాండ్ చేశారు. మతుని కుటుంబానికి సిపిఎం న ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తుందన్నారు. మతుని కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రక్షణ చర్యలు చేపట్టకుండా నిర్మాణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. ఆ కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి, భవిష్యత్తులో ఎలాంటి పనులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, నాయకులు ఐ.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ప్రజాశక్తి - గోపాలపురం

ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు తేమ పేరిట రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ మాధవరావు, పౌర సరఫరాల శాఖ సహాయ మేనేజర్ త్రినాథ్, డిఎస్ఒ ప్రసాద్ అన్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన సమస్యలపై మంగళవారం అధికారులు మిల్లర్లు, రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల జిల్లా అధికారులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది తేమశాతం నాణ్యత వంటివి పరిశీలించి కొనుగోలు చేస్తారన్నారు. అయితే మిల్లర్లు తేమ ఎక్కువగా ఉందనే నెపంతో కొనుగోలు కేంద్రం నుంచి వచ్చిన ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడానికి నిరాకరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా చేయొద్దని హితవు పలికారు. రైతులకు కావాల్సిన గోనె సంచులను ఏర్పాటు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులదేనన్నారు. సమావేశంలో పలువురు మిల్లర్లు ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటుందనే సమస్యను లేవనెత్తారు. దీనిపై స్పందించిన జిల్లా అధికారులు బియ్యం నూకల శాంపిల్స్‌ను సేకరించారు. వాటిని ఉన్నతాధికారులకు పంపించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ చంద్రశేఖర్, ఎఒ రాజారావులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో 'జగనన్నే మా భవిష్యత్తు'

ధవళేశ్వరం : ధవళేశ్వరం గ్రామంలోని స్థానిక రథం వీధి, గొల్లపేట, సున్నంబట్టీ వీధి జాలరి పేటలో వైసిపి రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వరరావు ఆదేశాల మేరకు మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వమించారు. నాయకులు మెండ రాజేష్, ఎంపిటిసి మాజీ సభ్యులు సాధనాల శివ హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితరాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు మిరప మహేష్, శివకృష, భాషా, పిల్లి బేబిమౌనిక, నవ్య, గీత, వెంకట లక్ష్మి, పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపుల ఏర్పాటు

ఉండ్రాజవరం : మండలంలోని పలు గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అధికారి ఎ.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం చివటం, దమ్మెన్ను, గురువారం వడ్లూరు, సత్యవాడ, గ్రామాల్లో ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

కుష్టు బాధితులకు చెప్పల పంపిణీ

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని సాగిపాడు శివారు లెప్రసీ కాలనీలో హుకుంపేట పిహెచ్‌సి వైద్యులు బివివి.దుర్గభవాని ఎంసిఆర్ చెప్పులను మంగళవారం పంపిణీ చేశారు. సాగిపాడు శివారులో లెప్రసి కాలనీలో 11 మందికి వీటిని అందించారు. ఈ సందర్భంగా దుర్గభవాని మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా డిస్టిక్ లెప్రసీ అండ్ టిబి డాక్టర్ వసుంధర ఆదేశాల మేరకు వీటిని పంపిణీ చేశామన్నారు. కుష్టు రోగులకు స్పర్శ లోపంతో కాళ్లకు చెప్పులు లేకపోతే గాయాలై పుండ్లు పడతాయన్నారు. ఎంసిఆర్ చెప్పులు వాడడం వల్ల వారు వీటిని నుంచి సురక్షితంగా ఉండొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రూతమ్మ, డిపిఎం వెంకటరావు, ఎంఎల్‌హెచ్‌పి జానపాటి సుధీర్, సిబ్బంది పద్మ, ఆశ వర్కర్ల పాల్గొన్నారు.

ఉండ్రాజవరం మండల ప్రత్యేక అధికారిగా కృష్ణారావు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తూర్పుగోదావరి జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు ఉండ్రాజవరం మండల ప్రత్యేక అధికారిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారని ఎంపిడిఒ ఎ.శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ఉండ్రాజవరంలోని ఆర్‌బికె, సత్యవాడ రోడ్డు, సినిమా హాల్ రోడ్డు, జగనన్న హౌసింగ్ లే అవుట్లను సందర్శించారన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ విక్టర్‌బాబు, మండల వ్యవసాయ అధికారి ఎం.విశ్వాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.సుదీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్న సమారాధన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

అవధూత, ఆధ్యాత్మిక గురువు సుధీంద్రబాబు జయంతిని పురస్కరించుకుని ఉండ్రాజవరం శ్రీ సుధీంద్రబాబు ఆశ్రమంలో మంగళవారం అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఉండ్రాజవరం, సుధీంద్రబాబు ధార్మిక ట్రస్ట్ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం 2వేల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉండ్రాజవరం, తణుకు ప్రాంతాలకు చెందిన ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

రెయిన్ గేజ్ పరిశీలన

ప్రజాశక్తి - తాళపూడి

వర్షపాతాన్ని కొలవడానికి ఉపయోగించే రెయిన్ గేజ్ చుట్టూ ఉన్న మొక్కలను తొలగించడంతోపాటు దీనికి అవసరమైన కొన్ని సూచనలు జిల్లా అధికారి చెప్పారని తాళ్లపూడి గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా ఆర్థిక మరియు గణాంక కార్యాలయ ఉపగణాంకాధికారి గోవాడ బెన్నీ విజయ కుమార్ మంగళవారం తాళ్లపూడి తాసిల్దార్ కార్యాలయం వద్ద గల రెయిన్ గేజ్ ను గేజును పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారని ఏఎస్ఒ తెలిపారు.

సర్పంచ్ స్టాలిన్‌కు అభినందనల వెల్లువ

ప్రజాశక్తి - కడియం

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డు అందుకున్న జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం ఆయన నివాసంలో పలువురు కలిసి మొక్కలు అందజేసి, శాలువాలు కప్పి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్టాలిన్ ధన్యవాదాలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో మండల వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ ఈలి గోపాలం, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారి ద్వారకాదేవి, ఉద్యాన శాఖ అధికారి సుధీర్ కుమార్, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, పలువురు ఉద్యోగులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గోపాలపురం మండల ప్రత్యేక అధికారిగా సత్య గోవింద్

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం మండల ప్రత్యేక అధికారిగా జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి ఎస్‌టిజి.సత్యగోవింద్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవితో సమావేశమయ్యారు. మండల సమస్యలపై ఆరా తీశారు. అదేవిధంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారిగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టిఐఎం.రాజు నియమితులయ్యారని తెలిపారు.

కార్టూ'నిజం'

వింతేంవుంది..? క్లోనింగ్ అవసరం లేకుండానే.. మన ఖాతాల్లో సొమ్ము మాయం కావడంలా..!!!

మలేరియాపై అప్రమత్తత అవసరం

జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, సదస్సులు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరంలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ మాధవీలత

మలేరియా మహమ్మారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైదులు సూచించారు. మంగళవారం ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. **ధవళేశ్వరంలో** స్థానిక పిహెచ్‌సి వైద్యులు సుధాకర్ బాబు ఆధ్వర్యంలో పిహెచ్‌సి సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశాలు ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. **పెరవలి** కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, వైద్యులు ర్యాలీ నిర్వహించారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ తేజశ్రీ మాట్లాడారు. మలేరియా నుంచి రక్షణ పొందాలంటే ప్రజలందరూ తప్పనిసరిగా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమల కుట్టకుండా దోమతెరలు, కిటికీ తలుపులకు మెస్‌లు అమర్చుకోవాలన్నారు. జ్వరం ఉంటే మలేరియా పరీక్ష చేయించుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు తేజశ్రీ హేమరాజ్, టిబి సూపర్‌వైజర్ ఆశాజ్యోతి, సూపర్‌వైజర్లు ఎజె.సంధాని, సత్యేంద్ర కుమార్, రాజసులోచన, కెవి.నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు. **ఉండ్రాజవరంలో** పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఉషాదేవి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా వ్యాధి, నివారణపై అవగాహన కల్పించారు. దోమల నియంత్రణా చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఎం.సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్, కెడివిఎల్.కుమారి, ఎంపిహెచ్ఎస్ కె.నాగమణి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు. **గోకవరం** పంచాయతీ కార్యాలయంలో ప్రపంచ మలేరియా నివారణా దినోత్సవాన్ని పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి నాయకులు సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, ఎంపిటిసి సభ్యులు రాంప్రసాద్ పాల్గొన్నారు ఈ సందర్భంగా సిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ వైఎస్.రాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిమ్మరాజు దొర, ఉపాధ్యాయుల, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **నల్లజర్ల** ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ తెల్లం గంగాధరరావు ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. నల్లజర్ల, ఆవపాడు గ్రామాల్లో ర్యాలీలు చేపట్టారు. **గోపాలపురం** మండలం హుకుంపేట పిహెచ్‌సి పరిధిలో మలేరియా నివారణపై అవగాహనా ర్యాలీలు నిర్వమించారు. డాక్టర్ జె.శ్రీనివాసరావు, బివివి.దుర్గాభవాని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రూతమ్మ, ప్రసాద్, నీలవేణి, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ట్రాక్టర్ నుంచి జారిపడి జట్టు కూలీ దుర్మరణం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ఇంజన్ సీటులో కూర్చున్న జట్టుకూలీ ప్రమాదవశాత్తూ జారిపడి దుర్మరణం చెందిన సంఘటన ఇది. సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం కెనాల్ రోడ్డులో ట్రాక్టర్‌పై అడ్డతీగల నుండి రామచంద్రపురం వెళుతుండగా, ఇంజన్ సీటులో కూర్చున్న జట్టు కూలీ పట్టిం నాగరాజు (30) ఇంజన్ టైర్ల కింద పడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ వేగంగా, నిర్లక్ష్యంగా నడపడంవల్లే ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు చెప్పారు. మంగళవారం ఉదయం జట్టు కూలీలు నాగరాజు, అప్పన్న, కృష్ణలు డ్రైవర్ కలగా త్రిమూర్తులు ట్రాక్టర్‌పై వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడు అడ్డతీగల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందినవాడు. కిర్రాపు శ్రీను పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సామర్లకోట ఎస్ఐ తోట సునీత దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి -యానాం

యానాం పట్టణపరిధిలో ఓ యువకుడు సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్ఐ శేరు నూకరాజు మంగళవారం తెలిపారు. పట్టణపరిధిలోని గొల్లల వీధికి చెందిన మరుకుర్తి రామకృష్ణ (21) తన స్వగృహంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్ప డ్డాడన్నారు .స్థానికులు హుటాహుటిన జిజిహెచ్‌కు తరలించగా అప్పటికే మతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబానికి అప్పగించినట్లు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సివుందని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

చోరీ కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి-కాట్రేనికోన

మండల పరిధిలోని, పల్లంకుర్రు మెయిన్ రోడ్డులో ట్రాక్టర్ దొంగతనం కేసులో ముగ్గురు యువకులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండ్ విధించినట్లు కాట్రేనికొన ఎస్ఐ టి శ్రీనివాస్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల16న రాత్రి పని ముగిసిన అనంతరం పల్లంకుర్రులో వెంకటేశ్వర స్వామి గుడి పక్కన గల ఖాళీ స్థలంలో తన ట్రాక్టర్, ట్రక్ ను పార్క్ చేసినట్లు ఫిర్యాదుదారుడు వాసంశెట్టి శ్రీనివాస రావు తెలిపారు. అప్పటికే ట్రాక్టర్ దొంగతనానికి పల్లంకుర్రు గ్రామానికి చెందిన పులుగు దశరథ మహారాజు, నాగళ్ళ శ్రీనివాస్ పథకం వేశారు. అప్పటికే ట్రాక్టర్ అమ్ముతామని పార్వతీపురం మన్యం జిల్లాకి చెందిన వరికోత మిషన్ యజమాని బొడేపు వినోద్ కుమార్ వద్ద రూ.2 లక్షల 69 వేలు మోసపూరితంగా పులుగు దశరథ మహారాజు,నాగళ్ళ శ్రీనివాస్ కాజేశారు. వినోద్ కుమార్ ఒత్తిడి చేయడంతో, ఫిర్యాదుదారుడు శ్రీనివాస రావుకి చెందిన ట్రాక్టర్, టక్ ను అర్ధరాత్రి పులుగు దశరథ మహారాజు,నాగళ్ళ శ్రీనివాస్ చోరీ చేశారన్నారు. దొంగతనం చేసిన ట్రాక్టర్‌ను వినోద్ కుమార్‌కు అప్పగించామన్నారు. వాసంశెట్టి శ్రీనివాస రావు ఫిర్యాదు మేరకు, కాట్రేనికోన ఎస్ కేసు నమోదు చేశారు. పల్లంకుర్రు నుంచి పార్వతిపురం వరకు సిసి టీవీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించారు. తక్కువ సమయంలో సిసి టీవీ కెమెరాల ద్వారా కేసు ఛేదించిన కాట్రేనికోన ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది కనకరాజు, మణికంఠలకు పలువురు అభినందనలు తెలిపారు.

చికిత్సపొందుతున్న బాధితులు

పిచ్చికుక్క దాడిలో 11 మందికి గాయాలు

ప్రజాశక్తి-కొత్తపేట

కొత్తపేట మండలం గంటి గ్రామం లో మంగళవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. ఈ సంఘటనలో 11మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులను స్థానిక ఏరియా ఆసుపత్రిలో జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి, గొల్లపల్లి డేవిడ్ రాజ్ ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. ఎంపిడిఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ రామన్, నాయకులు ఉన్నారు.ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి వైద్యులతో తో మాట్లాడి ఆస్పత్రిలోఉన్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు

50 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

సోమవారం నేలకోట రహదారి పురుషోత్తపట్నం గ్రామ శివారులో సారా తరలిస్తున్న వ్యక్తిని ఎస్ఐ కె.శుభశేఖర్ పట్టుకుని, అతని వద్ద 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవిపట్నం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన బొమ్మిన వీరబాబు నాటు సారా తయారు చేసి, సింగవరం గ్రామానికి చెందిన మార్గాని సూరిబాబుకు చేరవేస్తుండగా పట్టుకున్నారు. 50 లీటర్ల నాటు సారా, బైకును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచామని పోలీసులు తెలిపారు.

నత్త నడకన 'నాడు-నేడు' పనులు...

హెచ్ఎంపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలలో రూ.2.30 కోట్లతో ప్రారంభించిన "నాడు నేడు" పనులు గత సంవత్సర కాలంగా నిలిచి పోవడంపై పాఠశాల హెచ్ఎంను అధికారులు, ప్రజాప్రతినిధుల బృందం నిలదీసింది. పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు నిలిచిపోయిన విషయమై మంగళవారం ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు ఆధ్వర్యంలో ఎంపిడిఒ డి శ్రీ లలిత, ఎంఇఓ వై శివరామకృష్ణయ్య, పిఆర్ ఏఇ మణిమాల బృందం పాఠశాలను సందర్శించి నిలిచిపోయిన పనులను పరిశీలించారు. కాగా పాఠశాలలో మరొక విభాగం పూర్తిగా శిథిలమై స్లాబు పెచ్చులు ఊడి పడుతున్నందున దానిలోనికి విద్యార్థులు గాని, ఉపాధ్యాయులు కానీ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్ఎంకు ఎంపిపి సూచించారు. వాటి నిర్మాణానికి నిధుల మంజూరుకు సంబంధించి లెటర్ తయారు చేసి ఇస్తే, దానికి కృషి చేయనున్నట్లు ఎంపిపి చెప్పారు. ఈ సందర్భంగా పనుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పాఠశాల హెచ్ఎంను ఎంపిపి, ఎంపిడిఒ పలు హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ సామర్లకోట మండల పరిధిలో అతిపెద్ద ఉన్నత పాఠశాల అయిన కొండపల్లి గంగన్న మెమోరియల్ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 900 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నట్లు చెప్పారు. ఈ పాఠశాలలో 20 తరగతి గదుల నిర్మాణానికి రూ. 2.30 కోట్లు నాడు నేడు నిధులు మంజూరయ్యాయన్నారు. దానిలో భాగంగా మొదటి విడతగా రూ.56 లక్షలు, రెండో విడతగా రూ.15 లక్షలు నిధులు విడుదల కాగా మూడు తరగతి గదుల నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయన్నారు. వాటికి టైల్స్ ఏర్పాటు చేస్తే ఆ మూడు గదులు వినియోగంలోకి రానున్నట్లు ఆయన చెప్పారు. మిగతా 17 తరగతి గదులకు సంబంధించి నిర్మాణ పనులు ఏ విధంగానూ ముందుకు సాగక పోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కాగా ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టరును ఫోన్లో ఆయన హెచ్చరించారు. రానున్న రెండు రోజుల్లో పనులను ప్రారంభించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించినట్లు ఎంపిపి చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తరగతి గదుల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని విజయ మణిమాలకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిలిచిపోయిన పనులను పరిశీలిస్తున్న ఎంపిపి, అధికారుల బృందం

వృద్ధ కళాకారులకు రూ.5 వేల పింఛను ఇవ్వాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

వృద్ధ కళాకారులందరికీ నెలకు రూ 5 వేలు పింఛను ఇవ్వాలని ప్రజానాట్య మండలి మండల కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం స్థానిక యానిపల్లి సూర్యారావు ప్రజాభవనంలో సీనియర్ ప్రజానాట్యమండలి కళాకారుడు దారపురెడ్డి కృష్ణ అధ్యక్షతన మంగళవారం ప్రజానాట్య మండలి మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి రొంగల వీర్రాజు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కళలు,కళాకారుల ప్రదర్శనలకు ప్రోత్సాహం లేకపోవడంతో కళ ప్రదర్శనలను నమ్ముకుని జీవనం గడిపిన కళాకారులందరూ కళాకారులకు ఆదరణ లేక అవస్థలు పడుతున్నారన్నారు. వృద్ధాప్యంలో ఆదుకునే వారు లేక దీనస్థితిలో జీవనం గడుపుతున్నా న్నారు. గత మూడేళ్లుగా ప్రతి ఏడాది పింఛనుదారులకు పింఛను సొమ్ము పెంచినప్పటికీ కళాకారులకు మాత్రం పింఛను పెంచలేదన్నారు. కళాకారుల దుస్థితిని పరిగణలోకి తీసుకుని 60 సంవత్సరాల నిండిన వృద్ధ కళాకారులు అందరికీ నెలకు రూ.5 వేలు పింఛను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్రజానాట్య మండలి కళాకారులు దారపు రెడ్డి సత్యనారాయణ, గరగపాటి వెంకట్రామయ్య, నరసింహమూర్తి, అమత, నమ్రత, పూజిత, వివేక్, గౌస్, మహపాతిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీర్రాజు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్

వాణిజ్య ప్రాంతాల్లో సాయంత్రం వేళ పారిశుధ్య పనులు

మెయిన్ రోడ్డులో ట్రయల్ రన్

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వాణిజ్య ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరిచే క్రమంలో ఈవినింగ్ శానిటేషన్‌పై దృష్టి సారించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్. మహేష్ కుమార్ సూచించారు. ఇందుకోసం కాకినాడ 8వ సర్కిల్లోని మెయిన్ రోడ్ ప్రాంతాల్లో ఎపికె చేసి ట్రైల్ రన్ చేపట్టాలని ఆదేశించారు. మంగళవారం ఆయన అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. మెరుగైన పారిశుధ్య నిర్వహణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. ఇందులో భాగంగా మెయిన్ రోడ్ లోని మసీదు నుంచి జగన్నాథపురం వంతెన వరకు, ఆ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న అనుబంధ రహదారుల్లోనూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ఎపికె చేసిన ఈ ప్రాంతంలో రెండు వారాల పాటు ట్రైల్ రన్ కొనసాగించాలని, ఆ తరువాత మిగిలిన వాణిజ్య ప్రాంతాల్లో కూడా ఈ ప్రక్రియ కొనసాగించేలా చర్యలు తీసుకోవచ్చునని సూచించారు. ఒక ట్రాక్టర్, ఇద్దరు పారిశుధ్య కార్మికులను ఏర్పాటుచేసి వెంటనే ఈ ప్రక్రియ ప్రారంభించాలని కమిషనర్ సూచించారు. ఈ విషయంలో ఆయా సచివాలయ కార్యదర్శులు క్రియాశీలకంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. అనంతరం నగరంలోని డి-సిల్టేషన్ పనులపై కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల అధికారులతో సమీక్షించారు. పూడికతీత పనులను ఇంజనీరింగ్ విభాగంతో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్లు కూడా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ ఎస్ఈ పి. సత్య కుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, శానిటరీ సూపర్వైజర్లు జీలాని, రాంబాబు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న లయన్స్

క్రమం తప్పకుండా మందులు వాడాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

టిబి వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం త్వరితగతిని వ్యాధి నుండి బయటపడవచ్చని ఏలేశ్వరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎవిఐ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వాసుపత్రి ఆవరణలో వైద్యాధికారి శైలజ సమక్షంలో టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు ప్రభాకర చౌదరి, కోట శ్రీనివాస చక్రవర్తి, ఆసుపత్రి సిబ్బంది కె భాస్కరరావు ఎన్‌వి రమణ ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంసి చైర్మన్ కుడుపూడి

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎండియూడబ్ల్యూఏ) అధ్యక్షులు పెయ్యల రమేష్ ఆధ్వ ర్యంలో స్థానిక అంబేద్కర్ భవన్ ఎదురుగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ముమ్మిడివరం ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగా తహశీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపిడిఒ ఎం. అనుపమ పాఠశాల చిన్నారులకు, ఉపాధి కూలీలకు మజ్జిగ అంద జేశారు. కార్యక్రమంలో కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, తాళ్లరేవు మాజీ సర్పంచ్ రెడ్డి రెడ్డి బాబు, విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, ఎండియూ డబ్ల్యూఏ సంఘ కార్యదర్శి తాడి షణ్ముఖ రాజు, ఉపాధ్యక్షుడు మోకా ప్రసాద్, కర్నీడి వెంకటరమణ, నేరేడుమిల్లి స్వామి, కుడుపూడి మల్లేష్, సోను పాల్గొన్నారు.

యానాం వార్తలు

రోజుకు 100కు పైగా కరోనా పరీక్షలు

ప్రజాశక్తి - యానాం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోజుకు వందకు పైగా కరోనా పరీక్ష నిర్వహిస్తున్నామని ఆరోగ్యశాఖ డిడి టి.రవిశంకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వందకు పైగా కరోనా పరీక్షలు నిర్వహించగా ఒక్కరికి కూడా కరోనా నిర్ధారణ కాలేదని తెలిపారు. ప్రస్తుతానికి 12 పాజిటివ్ కేసులు ఉన్నాయని అన్నారు. ఎవరికైనా కరోనా లక్షణాలు ఉన్నట్లయితే ఆసుపత్రికి కరోనా పరీక్షలు చేయించుకోవాలని కోరారు.

పలు ఆలయాల్లో ఎంఎల్ఎ పూజలు

యానాం నియోజకవర్గంలో కొలువై ఉన్న పలు గ్రామాల ఆలయ అమ్మవార్లను ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ మేరకు స్థానిక ఫైర్ స్టేషన్ పక్కనున్న శ్రీ పోలేరమ్మ మహాలక్ష్మమ్మ ఆలయాన్ని ఎంఎల్ఎ అశోక్ తో పాటు ఆర్ఏవో మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్,డిటి సత్యనారాయణ తదితరులు దర్శించుకున్నారు. అనంతరం కనకాలపేట శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సరిహద్దు గోదను పరిశీలిస్తున్న ఆర్ఏవ మునిస్వామి

ఫిర్యాదులపై పరిశీలన

నియోజవర్గ పరిధిలోని పలు సమస్యలపై ఫిర్యాదుల రావడంతో మంగళ వారం ఆర్ఎఓ మునిస్వామి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ మేరకు యానాం పోలీస్ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న డ్రైన్ మిల్ మధ్య సరిహద్దు గోడను సర్వే డిపార్ట్మెంట్ సిబ్బంది కిషోర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం గౌరాబత్తుల వారి వీధిలో ఒక ఇల్లు శిథిల స్థితిలో ఉండడంతో దానిని కూడా ఆయన పరిశీలించారు.

నేడు లయన్స్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ది ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన లైన్స్ క్లబ్ యానాం పిల్లారాయ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఉదయం 9 గంటల నుండి ప్రారంభమవుతుందని చార్టర్ ప్రెసిడెంట్ పులపర్తి వెంకటరమణమూర్తి తెలిపారు. స్థానిక జివిఎస్ పార్వతీశ్వరమ్మ మినీ గార్డెన్స్‌లో జరిగే ఈ సమావేశానికి డిస్ట్రిక్ట్ గవర్నర్ మార్పూరి మంగతాయారు, ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునుస్వామి, ఎస్‌పి రఘునాయగం, మున్సిపల్ కమిషనర్ ద్విజ్ గోయల్, పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్పర్సన్ డివిఎస్ రాజు హాజరవుతారని తెలిపారు.

దోమకాటుతో మలేరియా

ప్రజాశక్తి - కాకినాడరూరల్

మలేరియా జ్వరం ఆడఅనాఫిలిస్ దోమ కుట్టడం వలన వస్తుందని డాక్టర్ సువర్ణరాజు పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ దోమ కుట్టిన పది రోజుల తర్వాత మలేరియా లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటే సులభంగా దాడి చేస్తుందని అన్నారు. ఇది రక్తహీనతలో వృద్ధి చెందుతుందని అన్నారు. జ్వరం, తలనొప్పి, చలి వంటి లక్షణాలు ఉంటాయని అని అన్నారు. జ్వరం తగ్గకపోతే మలేరియా నివారణకు పరీక్షలు జరిపి సత్వర చికిత్స పొందాలన్నారు. దోమలు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ సువర్ణ రాజు తెలిపారు. కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, రేలంగి బాపిరాజు, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాయే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-మండపేట

నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. మంగళవారం ద్వారపూడి శివారు వేములపల్లి జగనన్న కాలనీలో జగనన్న హౌసింగ్ స్కీంలో భాగంగా రూ.280.15 లక్షల అంచనా విలు వతో నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు నెలల్లో సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామన్నారు. ఇటీవల రాయవరం మండలంలోని సోమేశ్వరంలో సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసామన్నారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు, జెడ్‌పిటిసి సభ్యురాలు కురుపూడి భవాని, ఎంపిపి ఉండమట్ల వాసు, సర్పంచులు ఈతకోట కిస్వెర్, గాదిపాటి సౌజన్య అశోక్, తులా శివరావు, సొసైటీ చైర్ పర్సన్ దంతులూరి శ్రీరామ వర్మల, విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లాల ఎస్ఇ టివిఎస్ ఎన్.మూర్తి, విద్యుత్ శాఖ అధికారులు దాట్ల శ్రీధర్ వర్మ, జి. తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రం శంకుస్థాపనలో ఎంఎల్‌సి తోట

జిల్లాలో విద్యుత్ కోతలు ఉండవు

జిల్లాలో విద్యుత్ కోతలు ఉండవని విద్యుత్ శాఖ ఉమ్మడి జిల్లాల ఎస్ఇ.టివిఎస్ఎన్ మూర్తి అన్నారు. మంగళవారం సబ్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి ద్వారపూడి వచ్చిన ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 18.05 మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం ఉండగా మే నెలనాటికి 21.05 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందన్నారు. 980 మెగా వాట్స్ ఉండగా 1100 మెగా వాట్స్ కు పెరిగే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 220 సబ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 సబ్ స్టేషన్లు గాను 24 జగనన్న కాలనీలలోను 12 డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఒక్కొక్కదానికి రూ.3 కోటతో నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు, లోవోల్టేజ్ తదితర సమస్యలు అధిగమించడంలో భాగంగా ఇప్పటికే 1000 ట్రాన్స్‌ఫార్మర్లను అదనంగా ఉంచుకున్నామన్నారు. పిటిలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు 8 ఉన్నాయన్నారు.సబ్ స్టేషన్ మరమ్మతులు, ట్రీ కటింగ్ పనులు నిరంతరం జరుగుతున్నాయన్నారు. ఆయన వెంట రామచంద్రపురం డిఇ దాట్ల శ్రీధర్ వర్మ, ఎడి జి.తిరుమలరావు, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

గ్రామ స్థాయిలో ఓటర్ల వెరిఫికేషన్

ప్రజాశక్తి-రావులపాలెం

టిడిపి శ్రేణులు గ్రామాల్లో ఓటరు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని త్వరిత గతిన పూర్తి చేయాలని రాష్ట్ర టిడిపి కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు కోరారు. మంగళవారం స్థానిక రావులపాలెంలోని కాపు కల్యాణ మండపంలో ఆత్రేయపురం, ఆలమూరు, రావులపాలెం, కొత్తపేట మండలాలకు సంబంధించి క్లస్టర్ ఇంచార్జీలు, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ కన్వీనర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులకు ఓటర్ వెరిఫికేషన్ తదితర విషయాలు మీద ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రావులపాలెం మండల టిడిపి అధ్యక్షులు గుత్తుల పట్టాభిరామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ ఓటరు వెరిఫికేషన్ ద్వారా గ్రామాల్లో చనిపోయిన ఓటర్లను తొలగించడం, కొత్త ఓటర్ల నమోదు, కుటుంబాల వారిగా విడిపోయిన ఓటర్లను హౌస్ మ్యాపింగ్ చేయడం సాధ్యపడుతుందన్నారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు కంఠం శెట్టి శ్రీనివాసరావు, ముదునూరి వెంకటరాజు,మెర్ల గోపాలం, పోల్ కోఆర్డినేటర్ ముత్యాల బాబ్జి, క్లస్టర్ ఇన్చార్జిలు చిలువూరి సతీష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై హెచ్ఎంలకు శిక్షణ

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

మండల వనరుల కేంద్రం లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు మంగళవారం సోషల్ ఆడిట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి కె.తాతారావు అధ్యక్షతన జరిగిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఐడి కోఆర్డినేటర్ ఎవివి.సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీలోపు పాఠశాలల్లో పిఎంసి సమావేశాలు నిర్వహించి పాఠశాలలకు అవసరమైన అవసరమైన విషయాలను, సోషల్ ఆడిట్ యాప్ నందు తల్లిదండ్రుల సమక్షంలో ప్రశ్నావళి పూర్తి చేయాలని తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ ఎ. లక్ష్మీనారాయణ, రాజు, ప్రధానోపాధ్యాయులు, మండల సిబ్బంది పాల్గొన్నారు. **కొత్తపేట** మండల విద్యావనరుల కార్యాలయం నందు సోషల్ ఆడిట్ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖాధికారి ఎం. హరిప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయం

ప్రజాశక్తి-కొత్తపేట

ప్రజా సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. వాడపాలెం గ్రామంలో విలేకరుల సమావేశం ద్వారా వైసిపి ఏప్రిల్ 7న రాష్ట్రవ్యాప్తంగా 15 వేల సచివాలయాలలో జగనన్నే మాభవిష్యత్తు పేరుతో మెగా పీపుల్ సర్వేను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో 7 లక్షల మంది పార్టీ సైనికులు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఇంటినీ సందర్శించి, కొత్తపేట నియోజకవర్గంలో సుమారు 3500 మంది పార్టీ సైనికులు గృహ సారథులుగా, 260 మంది గ్రామ సచివాలయ కన్వీనర్లుగా ప్రతీ ఇంటికీ వెళ్ళి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. సంక్షేమ పథకాలు అందుకున్న ప్రతీ కుటుంబం జగనన్నే మా భవిష్యత్తు అని ముక్త కంఠంతో చెప్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిపి మార్గాని గంగాధరరావు, జెడ్‌పిటిసి సభ్యురాలు గూడపాటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎఎంసి డైరెక్టర్ నాగేశ్వరమ్మకు సత్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

ముమ్మిడి వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా తాళ్లరేవు మండలం నుంచి నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన సంగాని వీర నాగేశ్వరమ్మ సంగాని దాసు దంపతులను మంగళవారం కోరంగి పంచాయతీ సీతారామపురం పరిధిలో ఆలయం వద్ద స్థానికులు దుశ్శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీతారాంపురం, ప్రతాప్ నగర్, కోరంగి గ్రామాలకు చెందిన పెద్దలు పాల్గొన్నారు.

వీర నాగేశ్వరమ్మ దాసు దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు

వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి-అయినవిల్లి

వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గా అయినవిల్లి గ్రామానికి చెందిన కాకిలేటి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా తనపై నమ్మకం ఉంచి ఈ పదవి బాధ్యతలు అందించిన పి. గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబుకి కతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంఎల్ఎ చిట్టిబాబును శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శానపల్లిలంక సొసైటీ చైర్మన్ మట్టపర్తి రామారావు, శానపల్లిలంక గ్రామ శాఖ అధ్యక్షులు పీతాని వెంకటేశ్వరావు, దొమ్మేటి దుర్గారావు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి -కపిలేశ్వరపురం

వేసవిలో అపరాలు వేసుకున్న రైతులు వాటి వివరాలతో రైతు భరోసా కేంద్రాల వద్ద పంట నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. కపిలేశ్వరపురం మండలంలోని అంగర రైతు భరోసా కేంద్రం వద్ద మండల గ్రామ వ్యవసాయ సహాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ఆ శాఖకు సంబంధించి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించిందన్నారు. ఆ ధరకు విక్రయించుకున్న రైతులు వివరాలను ధాన్యం కొనుగోలు లాగిన్ లో ఆ సర్వే నంబర్లకు బ్లాక్ చేయాలన్నారు . అధిక ధర వస్తే రైతు బహిరంగంగా బయట మార్కెట్‌కు కూడా అమ్ముకోవచ్చు అన్నారు. అలా అమ్మిన రైతు సర్వే నంబర్లకు ధాన్యం కొనుగోలు లాగిన్ లో బ్లాక్ చేయాలన్నారు. అలా బ్లాక్ చేయడం ద్వారా ఆ సర్వే నంబర్లు దుర్వినియోగం కాకుండా ఉంటాయన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రం లో పచ్చిరొట్టపైర్ల విత్తనాలు, జీలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి కెవిఎన్.రమేష్ కుమార్, మండల గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-యంత్రాంగం

టిడిపి ఆధ్వర్యంలో పలుచోట్ల మంగళవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపినాయకులు పాల్గొని వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. వివరాలు ఇవి..

పెద్దాపురం తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పెద్దాపురం మండలం ఆనూరు గ్రామంలో నిర్వహించిన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో అభివృద్ధి జరగలేదన్నారు. పన్నులు పెంచడం,ధరలు పెంచడం తప్ప ప్రజా సమస్యలు పరిష్కరించడం జరగలేదన్నారు. అన్ని ప్రాంతాలలో రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు .రాష్ట్ర అభివృద్ధి కోసం రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), ఎలిశెట్టి నానినారాయణ, రామారావు,సిగాని అరవింద కుమార్, బత్తుల రాంబాబు,తలారి రాంబాబు, కొత్తెం బాబు,శ్రీను తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన** టిడిపి ఆధ్వర్యంలో మంగళవారం నడవపల్లి పంచాయతీ పరిధిలోని పల్లిపాలెం, తూర్పు పేట, నడవపల్లి మెయిన్ ,కొవాయి చెరువు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ దాట్ల బుచ్చిబాబు రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన వైసిపిని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఇంటికి సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ సందర్భంగా టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు జొన్నాడ రాంబాబు ఆధ్వర్యంలో కుశాయి చెరువు ప్రాంతానికి చెందిన 30 మంది పార్టీలో చేరారు. వీరికి బుచ్చిబాబు పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. **రామచంద్రపురం** పట్టణం లోని 22వ వార్డులో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పట్టణ టిడిపి అధ్యక్షులు కడియాల రాఘవన్ మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో గోకిపాటి సూర్యనారాయణమూర్తి, క్లస్టర్ ఇన్ ఛార్జ్ మేడిశెట్టి సూర్యనారాయణ తదితరులుపాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ

ప్రజాశక్తి - ఆలమూరు

గుమ్మిలేరులో అంగన్‌వాడీ కేంద్ర నిర్మాణానికి రూ. 16 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. దీంతో సర్పంచ్ గుణ్ణం రాంబాబు నిర్మాణ పనులకు మంగళవారం భూమిపూజ చేశారు.

బాధిత కుటుంబానికి సాయం

ఆలమూరుకు చెందిన గండేటి దుర్గ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. షయం తెలుసుకున్న మండలంలోని గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు తన వంతు సాయంగా తన వ్యక్తిగత బాధిత కుటుంబానికి కొంత మొత్తంలో నగదును దీంతో పాటుగా 25 కేజీల బియ్యాన్ని బాధిత వారి అందించారు.

ప్రాథమిక దశలో వ్యాధులు గుర్తించాలి

ప్రజాశక్తి -మండపేట

ప్రాథమిక దశలో వ్యాధులు గుర్తించడమే మేలని వైద్యులు సుమంత్, గీతా శ్రవణ్ లు అన్నారు. మంగళవారం స్థానిక కళ్యాణ మండపంలో పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య విజ్ఞాన అవగాహనా సదస్సులో వారు మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే నేటి వైద్య విధానంలో పూర్తిగా వైద్యాన్ని అందించవచ్చును. నేటి జీవనశైలిలో ఆహార నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మానసిక ఒత్తిడిలేని జీవన విధానాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పిఎంపి అసోసియేషన్ నాయకులు కోన సత్యనారాయణ, బివి.రమణ, వికె.రాజు, ఎ. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుని మృతి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎస్.కొత్తపల్లి పంచాయతీ రాజుపాలెం కు చెందిన శతాధిక వృద్ధుడు పొత్తూరి సత్యనారాయణ రాజు (104) వయోభారంతో మంగళవారం మృతి చెందారు. సత్యనారాయణ రాజుకు భార్య వెంకాయమ్మ కుమారులు వెంకటపతి రాజు, సత్యనారాయణ రాజు, రాజా, కుమార్తె అమ్మాజీ, మనుమలు, మునిమనుమలు ఉన్నారు. శతాధిక వృద్ధుడు సత్యనారాయణ రాజు మృతికి సర్పంచ్ కుంచే చిట్టికుమారి, ఎంపిటిసి సభ్యులు నడింపల్లి విజయలక్ష్మి, అంగాని అనంతలక్ష్మి,సొసైటీ అధ్యక్షులు నడింపల్లి వాసురాజు తదితరులు సంతాపం తెలిపారు.